క్లుప్తంగా

కాచాపూర్‌లో చలివేంద్రాలు ప్రారంభం



భిక్కనూరు : మండలంలోని కాచాపూర్ గ్రామంలో మోతో సంతోష్‌రెడ్డి ఏర్పాటు చేసిన మూడు చలివేంద్రాలను వీరేశ్వరాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆకుతోట స్వామి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతో సంతోష్‌రెడ్డి గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బస్టాండు వద్ద, పాఠశాల గ్రౌండ్ ఆవరణ, ధాన్యం కాంటాలు చేసే ప్రాంతంలో ప్రజలకు చల్లని మినరల్ వాటర్ అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో నేతలు జంగం బాలప్రకాశ్, సుధర్శన్,ల్యాబ్ శ్రీధర్, ముదాం శ్రీధర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'యోగా విస్తరణకు చేస్తున్న కృషి అభినందనీయం'



కామారెడ్డి అర్బన్: ఇంటింటికి, ప్రతివ్యక్తికి యోగాను తీసుకుపోవడంలో కృషి చేస్తున్న యోగా గురువుల సేవలు అభినందనీయమని యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి విద్యానగర్ రోటరీ క్లబ్ యోగా కేంద్రం మూడో వార్షికోత్సవాన్ని యోగా గురువులు అంతిరెడ్డి, వెంకటస్వామిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా రాంరెడ్డి, అంజయ్యగుప్తా, కే.రామచంద్రం, అనిల్‌రెడ్డి, కరుణశ్రీ, కవిత ఆర్యలను సన్మానించారు. రోటరీ యోగా కేంద్రానికి నిత్యం 50 మంది వరకు వస్తున్నారన్నారు.

నిలువనీడ కోసం వెతుకులాట



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేటలో కొంతకాలంగా జాతీయ రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా ఉన్న భారీచెట్లను గతంలోనే తొలగించారు. దీంతో ఎండలు తీవ్రమైన నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం మండలకేంద్రానికి వచ్చే ప్రజలకు నిలువ నీడ కరువైంది.

భానుడి భగభగ



మద్నూర్(జుక్కల్): వేసవి ఎండ తీవ్రతకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఎండవేడిమిని తట్టుకోలేకపోతున్నారు. సాయంత్రం ఆరుగంటల వరకు ఉక్కపోత తగ్గక పోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం ఎండ తీవ్రతకు మద్నూర్‌లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

వరి పంట విషతుల్యం



బాన్సువాడ రూరల్: వరి పంటకోతకు వారం రోజుల ముందు కూడా రైతులు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు పిచికారి చేస్తున్నారు. నారుమడి మొదలుకుని నాట్లేశాక, పొట్టదశల్లో, ఇలా ఇష్టారీతిన పురుగుల మందులు పిచికారి చేస్తూ పంటలను విషపూరితంగా మార్చివేస్తున్నారు. బాన్సువాడ శివారులో పంటకు కొంకిరోగం వచ్చిందని పలువురు రైతులు కోత దశలో ఉన్న వరిపంటకు రసాయన మందులు పిచికారి చేస్తున్నారు.

అంబేడ్కర్ సంఘం యూత్ నూతన కమిటీ ఎన్నిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ సంఘం యూత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కీసరి రంజిత్, ఉపాధ్యాక్షుడిగా గోల్కొండస్వామి, ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి సంజీవులు, రైటర్‌గా గైని రమేష్, ఉపకార్యదర్శిగా మెట్టు ప్రశాంత్, కోరైటర్‌గా బూర్గుపల్లి సుధాకర్, సలహాదారులుగా కీసరి ప్రవీణ్, మెట్టు నవీన్‌లను ఎన్నుకున్నారు.

నీటి కోసం మూగజీవాల తండ్లాట

- నిరుపయోగంగా నీటితొట్టెలు
- నిర్వహణ గాలికి వదిలేసిన అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న పశుపోషకులు



రతన్‌సింగ్ తండాలో గుంతలో నీటిని తాగుతున్న ఎద్దు



పెద్దకొడప్‌గల్‌లోని పాపనేశ్వర ఆలయం నుంచి వస్తున్న నీటి వాల్వ్ వద్ద పశువుల దాహార్తి తీరుస్తున్న కాపరి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వేసవిలో మూగజీవాలు నీటి కోసం తండ్లాతున్నాయి. ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ కింద జీవాల దాహార్తి తీర్చడానికి గిరిజన తండాలు, గ్రామాల్లో నీట్టి తొట్టెలను నిర్మించింది. సంబంధిత అధికారులు వీటి నిర్వహణ గాలికొదిలేయడంతో మూగజీవాలు తాగునీటి కోసం తండ్లాతున్నాయి. కొన్ని చోట్ల నీటి తొట్టెలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని చోట్ల నాసిరకంగా నిర్మించడంతో శిథిలావస్థకు చేరాయి. మండలంలో 23 గ్రామాల్లో నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలో పశుపోషకులు జీవాల దాహార్తి తీర్చడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా పశువులు సుమారుగా 7688 ఉన్నాయి. అడవికి మేతకు వెళ్లిన జీవాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతోపాటు పెద్ద దేవిసింగ్ తండా, పోచారం, పోచారం తండా విఠల్ వాడి, టికారాం తండా, చిన్న దేవిసింగ్ తండా, సముందర్ తండా, అంజని, శివాపూర్, చావుని తండా, రతన్ సింగ్ తండా, సర్దార్ తండా, బేగంపూర్ కాస్లాబాద్ తదితర గ్రామాలల్లో భూగర్భజలాలు తగ్గి చెరువులు ఎండిపోయాయి. నీరు లేక చెరువులు ఎడారులను తలపిస్తున్నాయి. పశువుల దాహం తీర్చేందుకు పోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి తొట్టెలకు మరమ్మతులు చేసి, అందులో నీటిని నిల్వ ఉంచి, ఉపయోగంలోకి తీసుకురావాలని పశుపోషకులు కోరుతున్నారు.

నీటి సౌకర్యం కల్పించాలి

పశువుల కోసం తండాలల్లో నీటి సౌకర్యం కల్పించాలి. చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు ఎక్కడ తాగునీరు దొరకడం లేదు. తండాల్లో నీటి తొట్లు లేకపోవడంతో పశువులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నీటి తొట్టెలకు మరమ్మతులు చేయించాలి. – గద్దునాయక్, పశుపెంపకందారుడు, టికారాం తండా

నీటి తొట్టెలు మరమ్మతులు చేయిస్తాం

నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. నీటి సౌకర్యం లేక అవి శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులు చేయించి, ఉపయోగించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – లక్ష్మీకాంత్ రెడ్డి, ఎంపీడీవో

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్న ఎస్సై



లింగంపేట శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మాచారెడ్డి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు, మసీదులు, చర్చిలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై అనిల్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఠాణాలో ఆలయ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారం రోజులలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపేట శివారులో ఆదివారం వాహనాల తనిఖీ చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువపత్రాలు, లైసెన్సులు లేనివారు, హెల్మెట్ ధరించని వాహన చోదకులకు జరిమానాలు విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం సైబర్ నేరాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సోమారంపేటలో నీటి కష్టాలు



మాచారెడ్డి: మండలంలోని సోమారంపేట మూడో వార్డులో గత కొద్ది రోజులుగా నీటి ఎద్దడి నెలకొని గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత మంచినీటి ట్యాంకుకు సరఫరా చేసే బోరు వట్టి పోవడంతో కొన్ని రోజులు ట్యాంకర్ తో నీటిని సరఫరా చేశారు. పది రోజుల నుంచి ట్యాంకర్ రాకపోవడంతో పంట చేల నుంచి నీటిని తెచ్చుకున్నారు. ఆదివారం ఓ రైతు పంట చేను బోరు నుంచి పైపు లైన్ వేసుకున్నాడు.బోరు యజమాని బోరు వేయగానే సదరు వార్డు ప్రజలు నీటిని సమకూర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తమ వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి



నిజాంసాగర్(జుక్కల్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు చేపట్టి ప్రభుత్వ మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ యాదవ్, కొరమండల్ సాయాగౌడ్, తోట. రాజు, చింతకింది. కాశయ్య రైతులు పోలీస్‌రాజు, ఎల్లారెడ్డి తదితరులున్నారు.

నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం అందజేయాలి



భిక్కనూరు: నిరుపేదలకు బార్ అసోసియేషన్ తరుపున ఉచిత న్యాయ సహాయం అందజేయాలని భిక్కనూరు మాజీ ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి కోరారు. ఆదివారం కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నంద రమేశ్‌ను భిక్కనూరు మండల కేంద్రంలో సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గాలిరెడ్డి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు జంగం బాలప్రకాశ్, నర్సింహారెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి సూచిక..



బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో సహకార సంఘం కార్యాలయం వద్ద రోడ్డు మూలమలుపును సూచిస్తూ గతంలో అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బోర్డు నెలరోజులుగా నేలచూపులు చూస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు స్పందించి వెంటనే సూచికబోర్డును సరిచేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహనీయుల అడుగుజాడలో నడుద్దాం



బిచ్కుంద(జుక్కల్): మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారిఅడుగు జాడలో నడుద్దామని మాజీ జెడ్పీటీసీ సాయిరాం, సీఐటీయూ జిల్లా నాయకుడు సురేష్ గొండ అన్నారు. ఆదివారం శాంతాపూర్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా మహనీయుల జయంతి ఉత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

బీడీ కార్మికులకు కరువుభత్యం అమలు చేయాలి



దోమకొండ: ప్రభుత్వం బీడీ కార్మికులకు కరువుభత్యం అమలు చేయాలని తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షలపై చిలుకు బీడీ కార్మికులు ఉన్నారన్నారు. బీడీ కంపెనీ యాజమన్యాలు స్పందించి వెయ్యి బీడీలకు రూ.11 చొప్పున కరువు భత్యం అందించాలని కోరారు. బీడీ కార్మికులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మొగా గ్రామ శివారులోని రైతు తన వ్యవసాయ భూమిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని రైతులు వాపోయారు. ఈదురు గాలులు వీస్తుండటంతో విద్యుత్ స్తంభం ఎప్పుడు విరిగి పడుతుందో అని రైతులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తం

తాడ్వాయి ఎస్సైగా రాజయ్య



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి ఎస్సైగా యం.రాజయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తాడ్వాయి ఎస్సైగా పనిచేసిన వెంకటేశ్వర్లు తన విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేసినా విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న రాజయ్య తాడ్వాయి ఎస్సైగా వచ్చారు.

రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల, పొల్కంపేట గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు కొనసాగుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువ వికాసానికి భారీ స్పందన

బాన్సువాడ రూరల్: రాజీవ్ యువవికాసం పథకం కోసం బాన్సువాడ మండలంలో భారీ స్పందన లభించింది. పలుమార్లు సర్వర్‌డౌన్ సమస్యలు తలెత్తినా మీసేవా కేంద్రాల వద్ద క్యూకట్టి మరి దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలను నేరుగా బ్యాంకుల ద్వారా అందించనుంది. మండలంలో మొత్తం దరఖాస్తులు 2700 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిలో 1100మంది మండల కార్యాలయంలో సంబంధిత సర్టిఫికెట్లు అందించారు.

రైతు మహోత్సవానికి తరలిరావాలి

బాన్సువాడ రూరల్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం జరిగే రైతు మహోత్సవ కార్యక్రమానికి మండల రైతులు హాజరై అవగాహన పొందాలని బాన్సువాడ మండల వ్యవసాయాధికారి ఫైజుల్లా కోరారు. మూడు రోజుల పాటు ఈకార్యక్రమాలు ఉంటాయన్నారు. వ్యవసాయ రంగంలో కొత్తకొత్త ఆవిష్కరణలు, కొత్త రకాల యంత్రాలు, విత్తనాలు, ఎరువుల యాజమాన్యానికి సంబంధించిన 150 స్టాల్స్ ఉంటాయన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జ్యోతిబాపులే గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. 6వ తరగతిలో కొత్తగా ప్రవేశం పొందే వారికి అలాగే ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షలో జ్యోతిబాపులే పాఠశాల సెంటర్‌లో 168 మంది విద్యార్థులకు గాను 154 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు.

ఈనెల 27న మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఈనెల 27న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తోటగాంధీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో వంద సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరో తరగతి వారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈనెల 21నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుక



ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఎల్లారెడ్డిలో కేకులను అందిస్తున్న మైనార్టీ క్రిస్టియన్ నియోజకవర్గ అధ్యక్షులు సుజిత్



భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో..

ఎల్లారెడ్డి/దోమకొండ/ఎల్లారెడ్డిరూరల్/భిక్కనూరు : జిల్లాలో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 41 రోజుల ఉపవాస దీక్షలను ముగించినట్లు వారు తెలిపారు.

నిరుపేదలకు అన్నదానం, చిన్నారులకు పండ్లను పంపిణీ చేశారు. చర్చిల నిర్వాహకులకు క్రిస్టియన్ మైనారిటీ ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు సుజిత్ కేకులను పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో చర్చి ఫాదర్లు, క్రైస్తవులు, తదితరులున్నారు.

ఘనంగా వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం



ఆలయంలోని వేంకటేశ్వర స్వామి మూల విరాట్

భిక్కనూరు: మండలంలోని అతి పురాతనమైన శ్రీవేంకటేశ్వరాలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారి, శ్రీదేవి–భూదేవిమాత విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశ్వక్సేన ఆరాధన, ధ్వజారోహణ, కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పబ్బనాగరాజు, చీకోటి వెంకటేశం, బొందుగుల నాగరాజయ్య, పబ్బనాగార్జున్, బొందుగుల సత్యం, గౌరిశెట్టి శ్రీనివాస్, చల్ల లక్ష్మణ్, బల్యాల సుదర్శన్, కల్లూరి సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించారు.

చలో శంషాబాద్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సోమవారం తలపెట్టిన చలో శంషాబాద్ వాల్‌పోస్టర్లను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం బాన్సువాడలో జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు ఆవిష్కరించారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కృష్ణ, రాజు, శ్రీకాంత్, పరమేష్ తదితరులున్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిసినట్లు ఫైర్ సిబ్బంది నరేందర్ తెలిపారు. ముగింపు ఉత్సవాలలో భాగంగా ఫైర్ సిబ్బంది వినియోగించే వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను తెగించి అందరి ఆస్తులు, ప్రాణాలు కాపాడడం గొప్ప విషయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా అన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది హరిబాబు ఉన్నారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి



మాచారెడ్డిలో మాట్లాడుతున్న గంపగోవర్ధన్



తాడ్వాయిలో పోస్టర్లను అతికిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాచారెడ్డి: కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం మాచారెడ్డిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బాల్ చంద్రం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మినుకూరి రామ్ రెడ్డి, నాయకులు రాజా గౌడ్, హంజీ నాయక్ బూస శ్రీనివాస్ లష్కర్ నాయక్, కూచని శేఖర్,శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు అన్నారు.మండల కేంద్రంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు ప్రధాన కూడళ్లలో, హోటళ్లలో చలో వరంగల్‌కు సంబంధించిన పోస్టర్లు గోడలకు అంటించారు.నాయకులు మెట్టురాములు, సంజీవరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, గంగారెడ్డి, సాయికుమార్ తదతరులు పాల్గొన్నారు.

హరిద్వార్ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో జ్ఞాన మహాయజ్ఞం



గాయత్రి జ్ఞాన మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి అర్బన్ : సనాతన హిందూ సంస్కృతికి ఆధారం నాలుగు వేదాలని హరిద్వార్ శాంతికుంజ్ అఖిల విశ్వ గాయత్రి పరివార్ ప్రతినిధులు విక్రమ్, సందీప్, శివాజీ, పూల్‌సింగ్, ఇప్పకాయల నర్సయ్యలు అన్నారు. ఆదివారం కామారెడ్డి పెద్ద చెరువు సమీపంలోని లక్ష్మినగర్‌లో అఖిల విశ్వ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో 108 కుండముల శ్రీగాయత్రి జ్ఞాన మహాయజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పరివార్ ప్రతినిధులు గాయత్రి యజ్ఞం, హిందు సంస్కృతికి సంబంధించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్న యజ్ఞం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.